

అవధాన విద్యకు మెదక్ పుట్టినిల్లు
● ప్రముఖ అష్టావధాని బొచ్కర్ ఓంప్రకాశ్
● మర్పడగ క్షేత్రంలో అష్టావధాన కార్యక్రమం
7



ఓ ఆటోడ్రైవర్ తన కుమారుడు చెబితే వినడం లేదని, చదవడం లేదని కొట్టగా, అతడి భార్య ఈ విషయమై గొడవ పడింది. దీంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని ఆత్మహత్యతో ఆయన భార్య, ముగ్గురు పిల్లలు పెద్ద దిక్కును కోల్పోయారు.

కూతురు తన మేనల్లుడిని కాకుండా వేరే అతడిని పెళ్లి చేసుకుందని మనస్తాపానికి గురైన ఓ తండ్రి చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నారు. మొదటి కూతురు గూర్చి ఆలోచించి మనోవేదనకు గురైన తండ్రి రెండో కూతురు, భార్య గూర్చి ఆలోచించకుండా బలవన్మరణానికి పాల్పడ్డాడు.

ఇలా నిత్యం ఏదో ఒక చోట వివిధ కారణాలతో బలవన్మరణాలకు పాల్పడతుండడం ఆందోళనకు గురి చేస్తోంది. అనాలోచితంగా ఆత్మహత్య చేసుకుంటుండంతో వారి కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి.

- గజ్వేల్, జూలై 13



అర్ధాంతరంగా.. తనువు చాలిస్తున్నారు!

ఆయా ప్రాంతాల్లో నిత్యం ఆత్మహత్యలు జరుగుతున్నా వ్యవసాయ పొలాలు, శివారు ప్రాంతాలల్లోనే ఎక్కువగా చేసుకుంటున్నారు. ప్రజల్లో మానసిక ధైర్యం తక్కువవడం, క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటుండడంతో ఈ ఆత్మహత్యలకు కారణాలుగా నిలుస్తున్నాయని మానసిక వైద్యులు చెబుతున్నారు.

- జిల్లాలో నిత్యం ఆత్మహత్యలు
- రోజు ఏదో ఒక మండలంలో ఘటన
- క్షణికావేశంలో.. చిన్నచిన్న కారణాలు
- 40 ఏళ్లలోపు వారే అధికం
- పోలీసు రికార్డుల్లో నమోదు కానివి అనేకం

సృష్టిలో విలువైనది ప్రాణం.. కానీ కొందరు క్షణికావేశంలో దానినే తృణప్రాయంగా వదిలేస్తున్నారు. చిన్నచిన్న కారణాలకే మనోధైర్యం కోల్పోతూ జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారు. వారిపై ఆధారపడిన కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగులుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజు ఏదో ఒక మండలంలో ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. బలవన్మరణాలతో ఉసురు తీసుకోవడం సరికాదని పోలీసులు కళాజాత ప్రదర్శనలతో గ్రామగ్రామాన ప్రచారాన్ని నిర్వహిస్తున్నా ఆత్మహత్యలు తగ్గడం లేదు.

ఆరు నెలల్లో 300కుపైగా..

జిల్లా వ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం నెలకు 30 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు తేలింది. కానీ వాస్తవానికి నెలకు 60 నుంచి 70 వరకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కేసులు నమోదు కావడం ఇష్టం లేక కొందరు పోలీసులను సమాచారం ఇవ్వకుండానే అంత్యక్రియలు చేస్తున్నారు. సరాసరి చూస్తే రోజుకు 2 ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఆరునెలల్లో అధికారిక లెక్కల ప్రకారం 168 మంది ఆత్మహత్య చేసుకుంటే ఈ సంఖ్య వాస్తవంగా 300కుపైగా ఉంటుందని తెలుస్తుంది. ముఖ్యంగా ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా 40 ఏళ్లలోపు వారే ఉండడం విషాదాన్ని నింపుతుంది.

అనేక కారణాలు..

భూముల విలువలు భారీగా పెరగగా.. సరిహద్దుల, సర్వే నంబర్ల సమస్యలతో గొడవలు పెరుగుతున్నాయి. ఈ ఆస్తి తగాదాలు ఆత్మహత్యలకు ఓ కారణమవుతుండగా.. ప్రేమ వ్యవహారాలతో యువత అర్ధాంతరంగా ఆయువు ఆపేసుకుంటున్నారు. రియల్ వ్యాపారం తగ్గడంతో భూములు కొనుగోలుకు ఎవరూ ముందుకు రాకపోవడం.. చేసిన అప్పు కట్టే మార్గం లేకపోవడం కారణంగా పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వాస్తవానికి రెండేళ్ల క్రితం వరకు సిద్దిపేట జిల్లాలో రియల్ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగింది. గత ప్రభుత్వం మార్కెట్ విలువను పెంచినప్పటి నుంచి వ్యాపారం నిలిచిపోయిందని పలువురు రియల్ వ్యాపారులు చెబుతుండగా, కరోనా సైతం ఒక కారణమని మరికొందరు చెబుతున్నారు. అప్పుల బాధతో కొందరు, అనారోగ్య సమస్యలతో మరికొందరు, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఇంకొందరు జీవితాన్ని చాలించి వారి కుంటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారు. మానసిక ఒత్తిడిని తట్టుకోలేక చాలా మంది చిన్న వయస్సులోనే తనువు చాలిస్తున్నారు.

సూసైడ్ స్పాట్‌గా మారిన ఎర్రకుంట

గజ్వేల్ పట్టణంలోని ఎర్రకుంట సూసైడ్ స్పాట్‌గా మారింది. ఇటీవల ఇక్కడి నుంచి ఎక్కువగా ఆత్మహత్యకు సంబంధించిన ఫోన్‌లు వస్తున్నాయని స్థానిక పోలీసులు చెబుతున్నారు. ఎర్రకుంట పట్టణానికి దూరంగా ఉండడం, ప్రజల సంచారం పెద్దగా లేకపోవడం, లోతైన ఎక్స్‌కవేటర్ గుంతలు ఉండడంతో ఆ ప్రాంతాన్నే పలువురు తమ సూసైడ్ స్పాట్‌గా ఎంచుకుంటున్నట్లు తెలుస్తుంది.

అధికారిక లెక్కల ప్రకారం.. నెల వారీగా ఎంత మంది

జనవరిలో	31
ఫిబ్రవరిలో	30
మార్చిలో	20
ఏప్రిల్‌లో	31
మేలో	29
జూన్‌లో	27





దోస్త్ మేరా దోస్త్..!

మెదక్ ఎంపీ రఘునందన్ శనివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తనతో ఇంటర్, డిగ్రీ చదువుకున్న స్నేహితులతో కలిసి, సరదాగా గడిపారు. 1980-85 బ్యాచ్‌కు చెందిన సుమారు 40 మంది సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఇంటర్ బైపీసీ, డిగ్రీ బీజేడీసీ చదివిన నాటి స్నేహితులు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

- సిద్దిపేట క్రైం, జూలై 13

ఖాకీల కక్కుర్తి..!

- ఫిర్యాదుదారుల నుంచి డబ్బు వసూలు
- ఇసుక వ్యాపారుల నుంచీ దండుకుంటున్న వైనం
- గతంలో ఓ ఎస్ఐ సస్పెన్షన్.. అయినా మారని తీరు
- చిన్నకోడూరు ఠాణాలో మితిమీరుతున్న కొందరు పోలీసుల ఆగడాలు



చిన్నకోడూరు, జూలై 13 : చిన్నకోడూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కొంతమంది పోలీసుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ అధికారుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయి. ఎస్ఐకి సంబంధం లేకుండా సమస్యల పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల నుంచి మొదలుకుని ఇసుక అక్రమ రవాణాదారుల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సెటిల్‌మెంట్‌లు..

పోలీసుస్టేషన్‌కు వచ్చే కొంతమంది ఫిర్యాదుదారుల నుంచి పోలీసు అధికారులు నేరుగా డబ్బు వసూలు చేస్తుండగా, మరి కొంతమంది ఫిర్యాదుదారుల నుంచి ఓ ప్రైవేట్ వ్యక్తిని మధ్యవర్తిగా పెట్టుకుని వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల మండల పరిధిలోని ఓ వాహనాన్ని మరో వాహనం ఢీకొట్టిన విషయమై పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వాహనదారుడి నుంచి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. సివిల్ తగాదాలలో పోలీసులు జోక్యం చేసుకోకూడదు. కానీ కొంత మంది పోలీసు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. సివిల్ తగాదాలలో తలదూర్చి సెటిల్‌మెంట్‌లు చేస్తూ డబ్బు వసూలు చేస్తున్నారని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

అవినీతి మకిలి

ఇటీవల మండలంలోని ఓ గ్రామ శివారులో అర్ధరాత్రి వేళలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకున్న ఓ పోలీసు అధికారి అక్కడికక్కడే డబ్బు తీసుకుని వదిలేసినట్లు తెలిసింది. గతంలో ఇక్కడ పని చేసిన ఓ ఎస్ఐ అక్రమ వసూళ్లకు పాల్పడి సస్పెన్షన్‌కు గురై చిన్నకోడూరు పోలీసుస్టేషన్‌కు అవినీతి మకిలీ అంటించి వెళ్లాడు. ప్రస్తుతం చిన్నకోడూరు పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కొంతమంది అధికారులు కూడా అదేబాటలో నడుస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. వీటిపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సదరు పోలీసు అధికారుల తీరుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చైర్మన్ బచ్చన్నపేటకు.. వైస్‌చైర్మన్ మద్దూరుకు?

చేర్యాల మార్కెట్ కమిటీ పదవులపై నిర్ణయం

- కమిటీలో చోటు కోసం పలువురి ప్రదక్షిణలు
- ప్రతిపాదన జాబితా సిద్ధం

చేర్యాల, జూలై 13 : చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకానికి కసరత్తు చేపట్టడంతో అందరి దృష్టి చైర్మన్ కుర్చీపై మళ్లింది. కమిటీలో ఎవరెవరికి ప్రాధాన్యం దక్కుతుందన్న విషయం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో, నేడు సిద్దిపేట జిల్లాలో అత్యధిక రాబడి ఉన్నా మార్కెట్‌గా చేర్యాల ఏఎంసీ నిలిచింది. దీంతో పాలకమండలిలో చోటు ప్రతిష్టాత్మకంగా మారడంతో పలువురు ఆశావహులు పైరవీలు ప్రారంభించారు. తమకంటూ ఒక్క ఛాన్స్ ఇవ్వాలని నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

చేర్యాల వ్యవసాయ మార్కెట్ పరిధిలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు జనగామ జిల్లా బచ్చన్నపేట, నర్మెట్ట మండలాలు ఉన్నాయి. 3 చెక్‌పోస్టులు, 30పైగా రైస్‌మిల్లులు, పారాబాయిల్డ్ ఇండస్ట్రీస్, జిన్నింగ్‌తో పాటు ఇతరత్రా ట్రేడర్స్ ఉన్నారు. వీటి ద్వారా యేటా రూ.4 కోటక్లేపైగా ఆదాయం సమకూరుతూ వస్తుంది. మార్కెట్ కమిటీ చైర్మన్ బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. పదేళ్లుగా అధికారానికి దూరం కావడం, పార్టీలో స్థానిక రాజకీయ పరిణామాలతో కార్యకర్తలు కొంతమేర నైరాశ్యానికి లోనవుతూ వచ్చారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చినందున ఆది నుంచి తనకు వెన్నంటి ఉన్నవారితో పాటు విధేయులుగా పనిచేసిన వారికి పట్టం కట్టాలని భావించి సామాజికవర్గాల కోణాన్ని పరిగణించి ఇప్పటికే పలువురిని ఎంపిక చేసినట్లు తెలిసింది. బచ్చన్నపేట మండలానికి చైర్మన్, మద్దూరు మండలానికి వైస్ చైర్మన్ కట్టబెట్టడంతో పాటు పార్టీ కోసం కష్టపడిన వారికి కమిటీలో స్థానం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. అందుకు సంబంధించి జాబితా ప్రతిపాదించాల్సిన నేపథ్యంలో ఇటీవల ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు.

పట్టాలు సరే.. ఇల్లు ఎక్కడా?

- నిర్మాణం పూర్తికాకుండానే 'డబుల్' ఇళ్ల మంజూరు
- పూర్తి చేసి ఇవ్వాలని లబ్ధిదారుల ఆందోళన
- అయినా పట్టించుకోని అధికారులు

హుస్నాబాద్, జూలై 13 : హుస్నాబాద్ పట్టణ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు ఇచ్చారు. తమ ఇళ్లను పూర్తి చేసి ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.



అసంపూర్తి పనులతో నిరూపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్



స్లాబ్ దశలో నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

ఏడేళ్లు గడుస్తున్నా..

హుస్నాబాద్ పట్టణంలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఏడేండ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి స్థాయిలో జరగలేదు. దీంతో పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు మంజూరు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. పట్టణంలోని నాగారం రోడ్డులో 2017 ఫిబ్రవరిలో అప్పటి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పనులకు శంకుస్థాపన చేశారు. మొదటి విడత 160 ఇళ్లు, రెండో విడతలో 400 ఇళ్లు మంజూరయ్యాయి. మొత్తం 560 ఇళ్లకు జీ ప్లస్ 2 పద్ధతిన నిర్మాణం చేపట్టారు. కానీ ఈ పనులు ఆగుతూ సాగుతూ వచ్చాయి.

264 మంది లబ్ధిదారులకు 168 ఇళ్లు

హుస్నాబాద్ పట్టణానికి 560 ఇళ్లు మంజూరైనప్పటికీ వివిధ కారణాలతో 288 ఇళ్లను మాత్రమే నిర్మించారు. ఇవి కూడా వివిధ దశల్లో ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరిలో డ్రా ద్వారా 264 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. అయితే ఇందులో 168 ఇళ్లు మొత్తం పూర్తయ్యాయి. 96 ఇళ్లు 80 శాతం పూర్తి కాగా 24 ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయి. ప్రస్తుతం 168 ఇళ్లలో లబ్ధిదారులు ఉంటుండగా 96 ఇళ్లు పూర్తి కాకపోవడంతో వీటిని పూర్తి చేసి ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్నారు. ఇళ్లు కేటాయించి సంవత్సరం దాటుతున్నా వాటిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వాటిని పూర్తి చేసి ఇళ్లలోకి పంపించాలని కోరుతున్నారు.

లక్ష్యం

రోజువారి ఆదాయం పెంచడానికి ఆర్టీసీ కృషి

ప్రయాణికులను ఆకర్షించడానికి లాటరీలు



సిద్దిపేట బస్‌డిపో

సిద్దిపేట అర్బన్, జూలై 13 : సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ సంస్థ రోజుకు అదనంగా రూ.లక్ష లక్ష్యంగా నడుము బిగించి ముందుకు సాగుతోంది. ప్రస్తుతానికి ఆర్టీసీ సంస్థకు ప్రధాన డిపోలలో వచ్చే రోజు వారి ఆదాయం కంటే ప్రతీరోజు రూ.లక్ష ఎక్కువగా వచ్చేలా కార్మికులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా సిద్దిపేట డిపోకు సంబంధించి 16 బస్సులు, 365 మంది సిబ్బంది ఉండగా, దుబ్బాక డిపోకు సంబంధించి 42 బస్సులు, 140 మంది సిబ్బంది ఉన్నారు. గజ్వేల్ డిపోలో 70 బస్సులు, 267 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఉచిత ప్రయాణంతో మహిళలు అధికంగా ప్రయాణం చేస్తుండడంతో పురుషులను ఆర్టీసీ ప్రయాణం వైపు ఆకర్షించే విధంగా సిబ్బందికి సంస్థ పలు సూచనలు చేసింది.

మహిళలు డీలక్స్ బస్సు ఎక్కితే..

ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణం చేస్తే టికెట్ తీసుకున్న మహిళా ప్రయాణికులు టికెట్ వెనకాల తమ ఫోన్‌నంబర్ అడ్రస్ రాసి లాటరీ బాక్స్‌లో వేస్తే పదిహేను రోజులకు ఒకసారి లాటరీ డ్రా చేసి రూ.వెయ్యి విలువ గల ఆకర్షణీయమైన చీరను బహుమతిగా అందజేయడానికి ఆర్టీసీ సంస్థ ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టింది. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ ప్రయాణించే ప్రయాణికులు రూ.170 పెట్టి టికెట్ తీసుకుని లాటరీ బాక్స్‌లో వేస్తే రూ.1000 బహుమతి అందుకోవచ్చు. ప్రత్యేకంగా పురుషులకు పథకాలు ఏమి పెట్టక పోయినప్పటికీ ఎక్కడ ఆపమంటే అక్కడ బస్సు ఆపేలా సిబ్బందికి సూచనలు చేశారు.

రూట్లు పెంచితే మరింత ఆదాయం

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్టీసీ పాత బస్టాండ్ కొత్త బస్టాండ్‌కు రోజు ప్రయాణికుల తాకిడి వేల సంఖ్యలో ఉంటుంది. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక డిపోలలో బస్సుల సంఖ్యను పెంచి ఆయా డిపో పరిధి నుంచి వెళ్లని రూట్‌లలో బస్సులను పెంచినట్లయితే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా సిద్దిపేట నుంచి కరీంనగర్, గోదావరిఖని, మంథని, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ రూట్లలో సిద్దిపేట డిపో నుంచి బస్సులు లేవు. స్థానికంగా సిద్దిపేట డిపో నుంచి ఆ రూట్లలో కూడా బస్సులు నడిపితే ఆదాయం మరింత పెరిగి అనుకున్న లక్ష్యం నేరవేరే అవకాశం ఉంటుందని పలువురు అంచనా వేస్తున్నారు.

పుణ్య క్షేత్రాలకు బస్సుల సౌకర్యం

ప్రధాన పుణ్య క్షేత్రాలకు సిద్దిపేట డిపో నుంచి బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ తక్కువ ట్రిప్పులు ఉండడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడుతుంది. ప్రస్తుతానికి అరుణాచల పుణ్యక్షేత్రంలో గిరి ప్రదక్షిణకు సంబంధించి దుబ్బాక డిపో నుంచి ప్రత్యేకమైన అధునాతన సూపర్ లగ్జరీ బస్సు నడపడానికి ఆర్టీసీ సిబ్బంది నిర్ణయించారు. అరుణాచల గిరి ప్రదక్షణకు వెళ్లే బస్సు ద్వారా కాణిపాక విఘ్నేశ్వర స్వామి దర్శనం, వేలూరు మహాలక్ష్మి అమ్మవారి దర్శనం, జోగులాంబ అమ్మవారి శక్తి పీఠ దర్శనం అయ్యేలా ఏర్పాట్లను చేశారు. అదేవిధంగా తెలంగాణ ఆంధ్రకు సంబంధించిన పుణ్యక్షేత్రాలకు సంబంధించి మరిన్ని బస్సులు పెంచినట్లయితే జిల్లా డిపోలకు ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది.

ఆదాయం పెంచడం కోసం అవగాహన కార్యక్రమాలు

ఆర్టీసీ ఆదాయం పెంచడం కోసం సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రయాణికులను ఎలా ఆకర్షించాలి, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించడంలో సిబ్బంది పాత్ర ఏమిటి అనే అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. మహిళా ప్రయాణికులకు లాటరీ ద్వారా బహుమతి వచ్చేలా ఏర్పాటు చేసి ఆదాయం పెంచడానికి కృషి చేస్తున్నాం. సురక్షితమైన ఆర్టీసీ ప్రయాణాన్ని కొనసాగించాలని ప్రయాణికులను కోరుకుంటున్నాం.

- సుఖేందర్‌రెడ్డి, డిపో మేనేజర్, సిద్దిపేట

రోడ్డుకు అడ్డంగా పరిశ్రమ కాలువ

గుమ్మడిద, జూలై 13: అసలే గుంతల రోడ్డుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అదీ చాలదన్నట్టుగా ఇటీవల వర్షం నీటిని వదలడానికి ఓ పరిశ్రమ ఏకంగా రోడ్డుని తవ్వేసి కాలువ నుంచి నీటిని వదలడం వాహనదారుల పాలిట ప్రమాద కరంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కానుకుంట గుమ్మడిదల ప్రధాన రోడ్డుపై గల ఓ పరిశ్రమ ఆవరణ నుంచి వర్షపు నీటిని వదిలేందుకు ఏకంగా రోడ్డునే తవ్వి కాలువ తీశారు. కానుకుంట గుమ్మడి దల గ్రామాలకు వెళ్లే వాహనదారులకు ఈ కాలువ ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ప్రమాదకర కాలువ విషయమై పరిశ్రమ యాజమాన్యాన్ని నిలదీసినా ఫలితం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. పెద్ద వాహనాలు రోడ్డు దాటాలంటే కాలువ అడ్డుగా మారిందని ఆరోపిస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలువను పూడ్చే విధంగా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.


ప్రధాన రోడ్డుపై తీసిన కాల్వ

కార్మికుల శ్రేయస్సే సీఐటీయూ ధ్యేయం


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కోహీర్, జూలై 13: కార్మికుల శ్రేయస్సే సీఐటీయూ కార్మిక సంఘం ప్రధాన ధ్యేయమని సీఐటీయూ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పేర్కొన్నారు. మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల పిరమల్ ఫార్మా పరిశ్రమలో ఈ నెల 15న జరుగనున్న కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా శనివారం కర్మాగారం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో చుక్కరాములు మాట్లాడారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల కోరికలకు అనుగుణంగా మంచి అగ్రిమెంటు చేసి చూపించిన సీఐటీయూ కార్మిక సంఘాన్ని మరోసారి గెలిపించాలని చుక్క రాములు కోరారు. పెరిగిన జీతంతో సంబంధం లేకుండా వీడీఏ డబ్బులను పెంచేల సీఐటీయూ కార్మికసంఘం కృషి చేసిందన్నారు. మెడిక్లెయిమ్ పాలసీ కార్మికుల వేతనాల నుంచి ఎలాంటి కోత లేకుండా యాజమాన్యమే పూర్తి డబ్బులు చెల్లించే విధంగా ఒప్పించి రూ.3 లక్షల నుంచి 4 లక్షల వరకు పాలసీని పెంచినట్లు తెలిపారు. 15వ తేదీన జరిగే కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు బి మల్లేశం, నాయకులు నర్సయ్య, సాయిలు, పాండురంగారెడ్డి, రాజిరెడ్డి, షైపాల్, నరసింహులు సందీప్ రెడ్డి, నారాయణ, గణేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్యాంటీన్లలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

పటాన్‌చెరు రూరల్, జూలై 13: చిట్కుల్ మహేశ్వర మెడికల్ కళాశాల క్యాంటీన్‌తోపాటు ముత్తంగి మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల క్యాంటీన్‌లను శనివారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేశారు. మహేశ్వర మెడికల్ కళాశాలలో ఫుడ్ హ్యాండ్లర్లు హెడ్‌క్యాప్స్, అప్రాన్లు ధరించి లేకపోవటం, స్టోర్ రూమ్‌లో ముడి పదార్థాలు చిందరవందరగా ఉండటం, క్లీనింగ్‌కి వాడే కెమికల్స్ ఆహార ముడిపదార్థాలతో ఉండటం, డస్ట్ బిన్స్ తెరిచి ఉండటం, స్టోర్‌లోని ఆహార పదార్థాలు బహిరంగ స్థితిలో ఉండటం గమనించారు. మహాత్మా జ్యోతిబా పూలే క్యాంటీన్‌లో ఫుడ్ హ్యాండ్లర్లు హెడ్ క్యాప్స్, అప్రాన్లు ధరించి లేకపోవటం, ఫుడ్ హ్యాండ్లర్లు ధరించిన దుస్తులు అపరిశుభ్రంగా ఉండటం, ఫుడ్‌హ్యాండ్లర్లకు మెడికల్ సర్టిఫికెట్స్ లేకపోవటం గమనించారు. ఆయా క్యాంటీన్లలో నమూనాలు సేకరించి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం ఆహార పదార్థాలను, గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యాంటీన్లు శుభ్రతను పాటించాలని సూచించారు.


టీచర్లను పట్టుకుని కన్నీటిపర్యంతమవుతున్న విద్యార్థినులు

మీరు ఇక్కడే ఉండండి టీచర్...!

తాడ్దానిపల్లిలో విద్యార్థినుల కన్నీటిపర్యంతం

పుల్‌కల్, జూలై 13: 'మీరు ఇక్కడే ఉంటూ పాఠాలు చెప్పండి టీచర్..! మీరు రాని బడికి మేము రాలేము' అంటూ విద్యార్థినులు గొల్లుమన్నారు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి కేంద్ర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీ స్వరూపతోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వారికి శనివారం పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చి బదిలీపై వెళ్తున్న వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను పట్టుకుని కంటతడి పెట్టుకుని బోరున విలపించారు. మీరు లేని పాఠశాలకు మేము రామంటూ గద్గదస్వరంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇక్కడికి వచ్చిన ఉపాధ్యాయులు కూడా బాగా పాఠ్యాంశాలు బోధించి మీ అందరితో కలుపుగోలుగా ఉంటా రని సర్దిచెప్పి పంపించారు. తాడ్దానిపల్లి గ్రామ విద్యార్థులు తమ పట్ల చూపిన గౌరవం, ప్రేమాభిమానాలు ఎన్నటికీ మర్చిపోమని బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

రూ.3.50 లక్షల విలువైన గుట్కా పట్టివేత

జిన్నారం, జూలై 13: బొల్లారం మున్సిపాలిటీలో రూ. 3.50 లక్షల విలువ గల నిషేధిత గుట్కా ప్యాకెట్లను సీసీఎస్, స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం బొల్లారం మున్సిపాలిటీలో సీసీఎస్, స్థానిక పోలీసులు పలు కిరాణ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. మూడు షాపుల్లో దాచి ఉంచిన 3.50 లక్షల విలువ గల గుట్కా సంచులను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ దశరథ, సిబ్బంది మల్లేశం, విజయేందర్, సంజయ్, చంద్రశేఖర్, మోతిరామ్‌లు పాల్గొన్నారు.


జేఎన్‌టీయూలో డీఈవో వెంకటేశ్వర్లు, విద్యార్థులు

యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, జూలై 13: హైదరాబాద్ కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో జరిగిన యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థులు పాల్గొన్నారు. యాంటీ డ్రగ్స్, ట్రాఫిక్, సేఫ్ అన్ సేఫ్ టచ్, ఉమెన్ సెఫ్టీ హిడెన్ కెమెరా అంశాలపై ఇంటర్నేషన్ పాఠశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ విభాగాలకు సంబంధించిన విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సులో జిల్లా నుంచి డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, జిల్లాలోని ఆరు పాఠశాలల గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

కొల్లూరు వద్ద ఎండు గంజాయి పట్టివేత

పటాన్‌చెరు/రామచంద్రాపురం, జూలై 13: రామచంద్రాపురం మండల పరిధి కొల్లూరు అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వద్ద ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... విశ్వసనీయమైన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు కొల్లూరు టోల్‌గేట్ వద్ద తమ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఈ క్రమంలో ఇద్దరు యాక్టీవా బైక్‌పై అనుమానస్పదంగా కనిపించడంతో ఏ. వంశీ, శివకృష్ణలను అడ్డుకుని ప్రశ్నించారు. వారి నుంచి 75 గ్రాముల ఎండు గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో శివకృష్ణ విచారణలో భాగంగా తమ ఇంటి వద్ద మరికొంత గంజాయి ఉన్నట్లు చెప్పడంతో ఖాజాగూడలోని నిందితుడి ఇంటికి వెళ్లి మరో 885 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకువచ్చినట్టు శివకృష్ణ తెలిపారు. ఈ మేరకు పటాన్‌చెరు అబ్కారీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని, శనివారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో సీఐ గాంధీనాయక్, ఎస్ఐ అనీల్‌కుమార్, ఎండీ సలీం, రామారావు నాయక్, మల్లయ్య, వివేక్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

137.76 గ్రాముల గంజాయి స్వాధీనం..

ములుగు, జూలై 13: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 137.76 గ్రాముల గంజాయి, బైక్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ములుగు ఎస్ఐ సీహెచ్ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రం గొండగవస్ గ్రామానికి చెందిన గవర్నగర్ మహేశ్ (28), జార్ఖండ్ రాష్ట్రం పరాసి గ్రామానికి చెందిన సద్దాం హుస్సైన్ (27), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సుతారిగూడకు చెందిన మహమ్మద్ అబ్దుల్ సమీర్ (26)లు దుండిల్‌కు చెందిన పద్మ వద్ద 10 పాకెట్ల గంజాయి కొనుగోలు చేశారు. అందులో నుంచి 8 పాకెట్లు అమ్మేశారు. మిగిలి రెండు పాకెట్లలో ఉన్న 137.76 గ్రాముల గంజాయిని బండమైలారం గ్రామంలోని సన్‌సిటీ వెంచర్ వద్ద అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఎస్ఐ విజయ్‌కుమార్, టాస్క్ ఫోర్స్ సీసీ జానకిరాంరెడ్డిలు సిబ్బందితో దాడులు చేశారు. పోలీసులను చూసి ముగ్గురు పారిపోతుండగా, పట్టుకుని విచారించారు. వారి నుంచి గంజాయి, రెండు బైక్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసినట్లు విజయ్‌కుమార్ వివరించారు.

ఎవరి కోసం ఈ భవనాలు..!

రూ. కోట్లు పెట్టి కట్టి.. వదిలేశారు..

కోహీర్‌లో నిరుపయోగంగా విలేజ్ హట్స్- ఖేడ్‌లో ఖాళీగా రైతు బజార్


నారాయణఖేడ్‌లో నిరుపయోగంగా ఉన్న రైతు బజార్

అవి రైతుల కోసం రూ. కోట్లు ఖర్చు చేసి కట్టిన భవనాలు.. కోహీర్‌లో పదేళ్ల కింద విలేజ్ హట్స్ కట్టి ప్రారంభించకుండా వదిలేశారు. నారాయణఖేడ్‌లో రైతులకు, వ్యాపారులకు ఏ మాత్రం అనుకూలంగా లేని చోట నిర్మించారు. దీంతో అవి ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ముళ్లపొదల మధ్య నిరుపయోగంగా విలేజ్ హట్స్

కోహీర్, జూలై 13: రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకుని ప్రయోజనం పొందడానికి వీలుగా మండల కేంద్రమైన కోహీర్‌లో విలేజ్ హట్స్ పేరుతో నిర్మించిన విక్రయ కేంద్రాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరాయి. అంతేకాకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. దీంతో రైతులు చేసేదేమీ లేక వారాంతపు సంతను రోడ్లపైన ఏర్పాటు చేసుకుంటున్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామీణాభివృద్ధి సంస్థ 2010లో విలేజ్ హట్స్‌ను మంజూరు చేసింది. స్థలం ఇస్తే భవన నిర్మాణాలకు నిధులు ఇస్తామని చెప్పడంతో మార్కెట్ కమిటీ స్థలాన్ని కొనుగోలు చేసి ఇచ్చింది. 2010 మార్చి 4న అప్పటి మంత్రి జె. గీతారెడ్డి భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూడేళ్ల తర్వాత 2013లో భవనాలు అందుబాటులోకి వచ్చాయి. విలేజ్ హాట్స్ పేరుతో ఓ గది, రెండు షెడ్లు, వ్యవసాయోత్పత్తులను ఆరబెట్టేందుకు రెండు ప్లాట్‌ఫాంలను నిర్మించారు. అధికారికంగా ప్రారంభించకపోయినా పదేళ్ల క్రితం మండల సమైక్య సంఘాల మహిళలు ఇక్కడ తాత్కాలికంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే, నేటికీ వాటిని ప్రారంభించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుని, కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం హట్స్ ఆవరణంలో పిచ్చి మొక్కలు ముళ్లపొదలతో నిండిపోయింది. గోడలకు బీటలు వాడాయి. విలేజ్ హట్స్ నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలేజ్ హట్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తే రైతులు వారాంతపు సంత అయినా ఇక్కడ నిర్వహించుకునే అవకాశం ఉంటుంది.



వినియోగంలోకి తీసుకురావాలి

పట్టణ ప్రధాన కూడలిలో నిర్మించిన రైతుబజార్‌లో వ్యాపార లావాదేవీలు కొనసాగనందున దానిని ఇతర అవసరాలకు వినియోగించాలి. నిరుపయోగంగా ఉండటంతో ప్రజాధనం వృథా అవడంతో పాటు భవనం శిథిలావస్థకు చేరుతుంది.

-నరేందర్, అధ్యక్షులు, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం

రూ. కోటితో కట్టారు..

నారాయణఖేడ్, జూలై 13: రైతులు, కూరగాయల వ్యాపారుల సౌలభ్యం కోసం గత ప్రభుత్వం రూ.కోటి వెచ్చించి నిర్మించిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. నారాయణఖేడ్‌లో అధిక శాతం ప్రజలు వ్యవసాయం చేస్తారు. కూరగాయలు పండించే రైతులు, వ్యాపారులకు సరైన స్థలం లేకపోవడంతో మార్కెట్ కమిటీ ద్వారా పాల శీతలీకరణ కేంద్రం ఆవరణలో రైతు బజార్‌ను నిర్మించారు. ఏడాదిలోనే పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవం కూడా చేశారు. ముందు భాగంలోని దుకాణ సముదాయాన్ని వ్యాపారులకు అద్దెకు ఇచ్చారు. రైతు బజార్ నిర్మించిన ప్రాంతం తమకు అనుకులంగా లేదంటూ కూరగాయల మార్కెట్ వ్యాపారులు కొద్ది రోజుల తర్వాత రైతు బజార్ ఖాళీ చేసి ప్రస్తుత మార్కెట్ నిర్వహిస్తున్న స్థలానికే వచ్చేశారు. దీంతో రైతు బజార్ నిరుపయోగంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో రైతులు, వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు, విశ్రాంతి గది శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. షెడ్ల మధ్యలో ఏర్పాటు చేసిన పార్కింగ్ టైల్స్ నుంచి పొదలు మొలకెత్తుతుండడానికి తోడుప్రధాన గేటు ముందు కూడ చెట్లు ఏపుగా పెరిగాయి. ప్రజాధనం వెచ్చించి నిర్మించిన రైతు బజార్ శిథిలావస్థకు చేరకముందే, ఇతర అవసరాలను వినియోగించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అస్తవ్యస్త విద్యుత్ సరఫరాపై ఆగ్రహం

సబ్‌స్టేషన్ ముట్టడి..
జాతీయ రహదారిపై బైఠాయింపు


ఆందోళన చేస్తున్న తండావాసులతో మాట్లాడుతున్న ఏఎస్ఐ

అల్లాదుర్గం, జూలై 13 : నెల రోజులుగా ఆ తండాకు సరిగ్గా కరెంట్ సరఫరా కాకపోవడంతో ఆ తండావాసులు ట్రాన్స్‌కో అధికారుల తీరును నిరసిస్తూ శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. సబ్‌స్టేషన్ ముందున్న 161వ జాతీయ రహదారిపై బైఠాయించి, సుమారు గంట పాటు ఆందోళన చేపట్టారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గొల్లకుంట తండాకు నెల రోజులుగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని తండావాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఏఈకి ఫోన్‌లో సమాచారం అందించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదని, శుక్రవారం రాత్రి మొత్తం కరెంట్ లేకపోవడంతో జాగారం చేయాల్సి వచ్చిందని అంటున్నారు. తండాకు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్నప్పటికీ ఎక్కడో దూరంలో ఉన్న ఫీడర్ చానల్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండాపై చిన్నచూపు చూస్తున్నారంటూ జాతీయ రహదారిపై బైఠాయించి విద్యుత్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తండావాసుల ఆందోళనతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఏఎస్ఐ దేవిదాస్ తన సిబ్బందితో వచ్చి ఆందోళన చేస్తున్న వారిని సముదాయించేందుకు ప్రయత్నించారు. సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించమని చెప్పడంతో ఏఎస్ఐ ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు తండావాసులు ఆందోళనను విరమించారు.

మేకల చోరీకి యత్నం

గొల్లకుంట గిరిజన తండాలో శుక్రవారం నాటి రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దొంగలు ఇదే అదునుగా తండాలోని మేకలను చోరీ చేసేందుకు ప్రయత్నించారు. అవి అరవడంతో అప్రమత్తమైన తండావాసులు బయటకు రాగా, దొంగలు కత్తులు చూపిస్తూ ఓ కారులో పరారయ్యారని తండావాసులు తెలిపారు.

హైకోర్టు జీపీగా అనంతుల


అనంతుల రవీందర్

చేర్యాల, జూలై 13: చేర్యాల పట్టణానికి చెందిన న్యాయవాది అనంతుల రవీందర్ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జీపీగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో ఆర్‌టీ నెం. 399 జారీ చేసింది. వ్యవసాయ కుటుంబానికి చెంది సౌమ్యుడిగా పేరొందిన అనంతుల రవీందర్ ఇరవై ఐదేళ్లుగా న్యాయవాదవృత్తిలో ఉన్నారు. 1994 అసెంబ్లీ ఎన్నికలలో చేర్యాల బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. బీజేపీలో వివిధ హోదాలలో కొనసాగుతూనే లీగల్‌సెల్‌కు సంబంధించి బీజేపీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. కొన్నినెలల క్రితం కాంగ్రెస్‌లో చేరిన రవీం దర్‌కు న్యాయవాదివృత్తిలో ఉన్న అనుభవం దృష్ట్యా గవర్నమెంట్ ప్లీడర్‌గా అవకాశం లభించింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన అనంతుల రవీందర్ హైకోర్టు జీపీగా నియమితులవడం పట్ల చేర్యాల న్యాయవాదులు భూమిగారి మనోహర్ తదితరులు హర్షం వెలిబుచ్చారు.

గజ్వేల్ కోర్టు ఏజీపీగా అనూష


అనూష

గజ్వేల్, జూలై 13: గజ్వేల్ ప్రిన్సిపల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టుల ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా పట్టణానికి చెందిన న్యాయవాది మూల అనూష నియమితులయ్యారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ మిక్కిలినేని మనూచౌదరి ఉత్తర్వులను వెలువరించారు. హైదరాబాద్‌కు చెందిన మూల అనూష పెండకంటి లా కాలేజీ (చిక్కడపల్లి)లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసి గడిచిన ఆరు సంవత్సరాలుగా ఆయా కోర్టులలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రస్తుతం ఏజీపీగా నియమితులవడంతో న్యాయవాదులు, బంధువులు, కుటుంబసభ్యులు ఆమెకు అభినందనలు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తే కేసులా..?

ఉపాధ్యాయ సంఘాల నేతలు

మెదక్ అర్బన్, జూలై 13: విధుల్లో నిర్లక్ష్యాన్ని ప్రశ్నించిన తపస్ జిల్లా అధ్యక్షులు ఎల్లంపై కొడపాక ప్రధానోపాధ్యాయురాలు కేసు పెట్టడాన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. శనివారం స్థానిక గుల్షన్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రాజ్‌గోపాల్‌గౌడ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, పీఈటీఏల అసోసియేషన్ జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, మాధవరెడ్డిలు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు బాధ్యత కలిగిన హోదాలో, ఆదర్శంగా నివాల్సిన స్థానంలో ఉండి కాంప్లెక్స్‌లోని ఏ పాఠశాలలను సందర్శించకపోవడం, ఉపాధ్యాయులతో సరైన భాషలో మాట్లాడకపోవడం ఘోరమన్నారు. బదిలీపై వెళ్లిన ఎల్లం లాస్ట్ పే సర్టిఫికెట్ కోసం వెళ్లితే నువ్వెవరని హెచ్ఎం అవమానించారని ఆరోపించారు. ఉపాధ్యాయుల పట్ల వైఖరిని మార్చుకోవాలని హెచ్ఎంకు సూచిస్తే.. బాధ్యతగా వ్యవహరించాల్సిన హెచ్ఎం అక్రమ కేసులు నమోదు చేయించడం సరైంది కాదన్నారు. ఉపాధ్యాయుడు ఎల్లంపై నమోదు చేయించిన కేసును వెంటనే హెచ్ఎం ఉపసహంరించుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర

హుస్నాబాద్, జూలై 13: వివిధ ప్రభుత్వశాఖల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో శనివారం జరిగిన హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల ఏఐవైఎఫ్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. తక్షణమే మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద పవన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగామ రాజ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్థన్, మాడిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



శరవేగంగా నిమ్జ్ రోడ్డు పనులు

ఝరాసంగం, జూలై 13: జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్) నిమ్జ్ 65 వ జాతీయ రహదారి నుంచి 9 కిలోమీటర్ల మేర తారు రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి చౌరస్తా నుంచి నిమ్జ్ వరకు 100 మీటర్ల వెడల్పుతో తొమ్మిది కిలో మీటర్ల మేర రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ. 100 కోట్లు మంజూరు చేశారు. ఝరాసంగం మండలంలోని మాచునూర్, ఏల్గోయి, క్రిష్ణాపూర్, బర్దీపూర్ గ్రామాల్లో 65 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 229మంది రైతులకు గాను రూ. 7.5 కోట్లు పరిహారంగా చెల్లించారు.

ప్రాజెక్ట్ పూర్తయితే ఉపాధి అవకాశాలు.

నిమ్జ్ ప్రాజెక్ట్ పూర్తయితే ఈ ప్రాంతపు యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2.50 లక్షల మందికి మేలు చేకూరనుంది. ఇప్పటికే పలు పరిశ్రమలతో గత ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. ట్రైటాన్‌కు 150 ఎకరాలు, లైట్ ఆటో పెట్టుబడికి 100 ఎకరాలు, వెమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటుకు 511 ఎకరాలను కేటాయించింది. హుండాయ్ పరిశ్రమ ఏర్పాటు కూడా జరగనున్నట్లు తెలిసింది. ఈ పరిశ్రమలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. దీని దృష్టి సారించి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేశారు.

అవధాన విద్యకు మెదక్ సీమ పుట్టినిల్లు

కొండపాక, జూలై 13: అవధాన విద్యకు మెదక్ సీమ పుట్టినిల్లని ప్రముఖ అష్టావధాని డాక్టర్ బోచ్కర్ ఓంప్రకాశ్ పేర్కొన్నారు. కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శ్రీ విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ కవి బండకాడి అంజయ్య గౌడ్ అష్టావధానం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఓం ప్రకాశ్ మాట్లాడుతూ అష్టకాల నరసింహ రామశర్మ, గుమ్మనగారి లక్ష్మి నరసింహశర్మ అష్టావధానం ప్రక్రియను సామాన్యుడి చెంతకు తీసుకువెళ్లారని తెలిపారు. గౌరీభట్ల రామకృష్ణ కవి అవధాన కళావికాసానికి పలువురిని ప్రోత్సహించారని, శతావధాని జీఎం రామశర్మ ప్రపంచ తెలుగు మహాసభలలో సిద్దిపేట కీర్తిప్రతిష్ఠలు చాటిచెప్పారన్నారు. పృచ్ఛకులుగా వర్కోలు లక్ష్మయ్య, ఉస్మాన్, గొల్లపల్లి రఘురామశర్మ, మిట్టపల్లి పరశురాములు, గండికోట కోటిలింగశర్మ, మచ్చ అనురాధ, ఉండ్రాళ్ల రాజేశం పాల్గొన్నారు. మంచినీళ్ల సరస్వతి, బాల సరస్వతి ప్రసంగించారు. అనంతరం అవధాని బండకాడి అంజయ్య గౌడ్, అతిథులను ట్రస్ట్ సభ్యులు హరినాథశర్మ, గట్టు విఠల్, నర్సింహారెడ్డి, మర్యాల రవీందర్, తిరుపతిరెడ్డి, బ్యాకు చంద్రశేఖర్ సత్కరించారు.


అవధానిని సత్కరిస్తున్న క్షేత్ర నిర్వాహకులు


మాట్లాడుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్

శతకాలు మానవ జీవన వికాసానికి దోహదం

కొండపాక, జూలై 13: శతకాలు మానవ జీవన వికాసానికి దోహదం చేస్తాయని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఆచార్య త్రివేణి అభిప్రాయపడ్డారు. కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శనివారం విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీళ్ళ రఘురామశర్మ రచించిన ధర్మపురి నృసింహ శతకాన్ని, బండకాడి అంజయ్య గౌడ్ రచించిన ధీనిధి శతకాల ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శతకాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ విజయాన్ని ప్రసాదించే అమ్మగా ప్రఖ్యాతి గాంచిన విజయ దుర్గాదేవి క్షేత్రంలో ఆవిష్కరించడం చారిత్రాత్మకమన్నారు. సభకు అధ్యక్షత వహించిన క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ మాట్లాడుతూ కీర్తిశేషులు మంచినీళ్ళ రఘురామశర్మ రచించిన ధర్మపురి నృసింహ శతకం భక్తి, జ్ఞాన వైరాగ్యాలకు ఆత్మ నివేదనకు ఆలవాలమని అన్నారు. బండకాడి అంజయ్య గౌడ్ రచించిన ధీనిధి శతకం సామాజిక నీతి శతకమన్నారు. శతకాలను గమ్మనగారి బాల సరస్వతి, మురళీధర శర్మ పరిచయం చేశారు. విశ్రాత ఉపన్యాసకులు వేలేటి మృత్యుంజయశర్మ, అష్టకాల విద్యా చరణ్, సింగీతం నరసింహారావు, అవధాని గౌరీభట్ల రఘురామ్ శర్మ, మంచినీళ్ళ సరస్వతి, జనమంచి ఫణీంద్ర తదితరులు ప్రసంగించారు.

భక్తులతో కిటకిటలాడిన నాచగిరి క్షేత్రం

వర్గల్, జూలై 13: మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢమాసం రెండో శనివారం కావడంతో నాచగిరి క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ పుష్కరిణీలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. క్షేత్రంలోని స్వామివారి దర్శనంతో పాటు ఉప ఆలయాలైన సీతారామచంద్రులు, శివాలయం, దత్తసాయి, హనుమాన్, కాలభైరవస్వామి ఆలయాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండో శనివారం సందర్భంగా ఆలయంలో సామూహిక సత్యనారయణస్వామి వ్రతాలు, నిత్య కల్యాణాలు, స్వామివారికి నిజాభిషేకాలను భక్తులు నిర్వహించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ తెలిపారు.

ధ్వజస్తంభ సంప్రోక్షణ

నారాయణరావుపేట, జూలై13: స్వయంభూ శ్రీబుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం సంప్రోక్షణ నిర్వహించినట్లు దేవాలయ శాఖ కార్యనిర్వహణ అధికారి విశ్వనాథ్‌శర్మ తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న బుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థానం ధ్వజస్తంభంపై భాగం నెల క్రితం గాలివాన బీభత్సంతో ధ్వంసమైనందున సంప్రోక్షణ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయం జూనియర్ అసిస్టెంట్ చందు, ఆలయం మాజీ చైర్మన్ పోదిల కిషన్, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, ఆలయ నిర్మాణం కర్తలు చికోటి లింగేశ్వర్, అయితే ప్రభాకర్, ఇరుకుల భైరయ్య, ఆలయ అర్చకులు సీతారామశర్మ, అనూప్‌శర్మ, హరికేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు

ప్రారంభమైన ఆషాఢ ఉత్సవాలు

మర్కుక్, జూలై 13: మండల పరిధిలోని భావనందాపూర్ గ్రామ శివారులో ఉన్న పాండురంగాశ్రమంలో ఆషాఢ ఉత్సవాలు శనివారం యతివర బావానంద భారతీస్వామి పాదుకపూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆశ్రమంలో ఆరు నెలల పాటు జరిగే ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలు మదునూరి వెంకటరమణ శర్మ వ్యాఖ్యానంలో రసరాజశర్మ ఆధ్వర్యంలో జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బావానందశర్మ, శ్రీధర్‌శర్మ, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బోనాలు..

గజ్వేల్, జూలై 13: గజ్వేల్ పట్టణంలో శ్రీమహంకాళీ దేవీ ఆలయంలో ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జాతరలో భాగంగా శనివారం ఆలయ పూజారి చాడ నందబాలశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహాపూజ, చండీ హోమం, పూర్ణాహుతి, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం సామూహిక శ్రీలలితా సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ శ్రీధర్‌రావు, కౌన్సిలర్లు బాలమణి, ఉప్పల మెట్టయ్య, బొగ్గుల సురేశ్, ఎర్రం శ్రీనివాస్, నేతి సంతోష్, ప్రవీణ్‌కుమార్, నర్సింగరావు తదితరులున్నారు.

● **మిరుదొడ్డి:** మండల కేంద్రంలో నేడు జరిగే మహంకాళీ బోనాలను విజయవంతం చేయాలని రెడ్డి సంఘం సీనియర్ నాయకుడు అంజిరెడ్డి కోరారు. మిరుదొడ్డిలో శనివారం రెడ్డిసంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. ఆషాఢమాసంలో మహంకాళీ ఆలయంలో జరిగే బోనాల పండుగలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు తదితరులున్నారు.


నారాయణరావుపేట: దేవస్థానంలో నవగ్రహ పూజ నిర్వహిస్తున్న అర్చకులు


వర్గల్: నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


మర్కుక్: బావానందస్వామికి ఆదిపూజ నిర్వహిస్తున్న పురోహితులు


మిరుదొడ్డి: మిరుదొడ్డిలో ఆలయం వద్ద మాట్లాడుతున్న రెడ్డిసంఘం నాయకులు


గజ్వేల్: ఆలయంలో అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న చైర్మన్ రాజమౌళి, భక్తులు

అప్పుల బాధతో ఆత్మహత్యయత్నం.. వ్యక్తి మృతి


కనకరాజు(ఫైల్)

నారాయణరావుపేట, జూలై13: అప్పులబాధతో మనస్తాపం చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుర్రాలగొందికి చెందిన బొమ్మ కనకరాజు (35) కిరాణం దుకాణం నడిపించుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలోనే సుమారు 4 నుంచి 5 లక్షల వరకు అప్పులు అయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై సోమవారం గడ్డి మందు తాగి తన భార్యకు ఫోన్ చేసి పిల్లలు జాగ్రత్త అని చెప్పి ఫోన్ కట్‌చేశాడు. దీంతో ఆందోళన చెందిన ఆమె అతడి అక్కకు ఫోన్ చేసి విషయం చెప్పింది. వారు కనకరాజుకు ఫోన్ చేయగా మల్యాల స్టేజీ వద్ద కల్లు మండువ దగ్గర గడ్డి మందు తాగినట్లు చెప్పడంతో అక్కడకు వెళ్లి 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య హరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నకోడురు ఎఎస్ఐ మురళీధర్‌గౌడ్ తెలిపారు.మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దు

● కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్


మాట్లాడుతున్న ఎస్ఐ రాజుగౌడ్

చేర్యాల/మర్కుక్, జూలై 13: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడకూడదని, గంజాయి తదితర మత్తు పదార్థాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమురవెల్లి ఎస్ఐ రాజు గౌడ్ అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టిసారించాలని, గంజాయి, మత్తు పదార్థాలబారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఆయనవెంట ఏఎస్ఐ సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు. మర్కుక్ మండల కేంద్రంలో శనివారం పోలీస్ కళాబృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరాలు, హెల్మెట్ వినియోగం తదితర అంశాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ఎస్ఐ మధుకర్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు.

నిధుల దుర్వినియోగంపై మాత్రమే ఫిర్యాదు

● పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహచారి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కుకునూరుపల్లి, జూలై 13: మంగోల్ గ్రామపంచాయతీకి చెందిన ఆర్‌ఈజీఎస్ నిధులకు లెక్కలు చూపనందునే నిధుల దుర్వినియోగంపై అధికారులకు ఫిర్యాదు చేశామని, ఎవరిని ఉద్దేశించి ఫిర్యాదు చేయలేదని పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహచారి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం పలువురు కాంగ్రెస్ నాయకులతో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా 2023-24 సంవత్సరానికి సంబంధించిన రూ.4,50,600 గ్రామపంచాయతీకి వచ్చాయని, ఈ నిధుల వివరాలు రికార్డులలో నమోదు కాలేదని, దీనిపై అధికారులు విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశామన్నిరు. కానీ ఏ ఒక్కరి పేరును ఫిర్యాదులో చేర్చలేదని తెలిపారు. శుక్రవారం కొండపాకలో జరిగిన ఎన్ఆర్ఈజీఎస్ ఆడిట్ సమావేశానికి గ్రామం నుంచి కొంతమంది వ్యక్తులను తీసుకువచ్చి తాము నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదని చెబుతున్నారని, అసలు ఫిర్యాదులో ఆ వ్యక్తి పేరు తాము ప్రస్తావించలేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరేశం, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌చారి, బాపురెడ్డి, దాసరి నర్సింహులు, లగిశెట్టి మహేందర్ పాల్గొన్నారు.

'పాదయాత్రను విజయవంతం చేయాలి'

మిరుదొడ్డి, జూలై 13: గ్రామాల్లోని సమస్యలను పరిష్కంచడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మిరుదొడ్డి మండల మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజులు ఆరోపించారు. మిరుదొడ్డిలో శనివారం ఆయన మాట్లాడారు. మిరుదొడ్డి మండలంలోని అల్వాల్, గుడికందుల మధ్యలో ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న గ్రామస్థులతో కలిసి సిద్దిపేట కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు విజయవంతం చేయాలని కోరారు.

పథకాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి

● దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

సిద్దిపేట అర్బన్, జూలై 13: ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించాలని, ఉద్యోగ నియామకాల్లో శారీరక దివ్యాంగుల రోస్టర్ 10లోపు తగ్గించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. సిద్దిపేటలో శనివారం నిర్వహించిన దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా మూడో మహాసభకు హాజరైన ఆయన మాట్లాడారు. రాష, దేశవ్యాప్తంగా దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో అక్రమాలు ఉన్నాయని, ఆర్థిక నిర్వహణ సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. దివ్యాంగుల పెన్షన్ 6000కు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్, ఎన్‌పీఆర్‌డీ నాయకులు సాజిద్, వెంకటేశ్వర్లు, ఇస్తారి, ఎల్లం, కైలాసం, సాయిలు, యాదగిరి ,లక్ష్మి, నారాయణ, పాషా, కలవ్వ, లింగం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

డబ్బులు తీసుకుని అసత్య ఆరోపణలు చేయడం తగదు

● చేర్యాల కాంగ్రెస్ నాయకుల ఆరోపణ


చేర్యాల: సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేర్యాల, జూలై 13: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన డబ్బులు తీసుకుని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తదితరులు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు చెరుకు రమణారెడ్డి, సనాది భాస్కర్ ఆరోపించారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిస్వార్థ రాజకీయానికి నిదర్శనమైన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై భూకబ్జా ఆరోపణలు చేయడం సబబు కాదని, ఎలాంటి ఆధారాలున్నా బహిర్గతం చేసి నిరూపించాలని సవాల్ విసిరారు. సమావేశంలో నాయకులు ఎండీ జహంరుద్దీన్, తాటికొండ సదానంద చారి, కాయిత శ్రీనాథ్‌రెడ్డి, మామిడాల నాగరాజు, ర్యాకం ప్రభాకర్, బండి శ్రీనివాస్, రేకులపల్లి సాయి, ఎండీ.నవాజ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే నర్సారెడ్డిపై ఆరోపణలు

కొండపాక, జూలై 13: డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిపై కొంతమంది ఓర్వలేక ఆరోపణలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసవి లింగారావు ఆరోపించారు. మండలంలోని వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజలకు ఆపద వస్తే ముందుండి నేనున్నానని చేయూతనిచ్చే మాజీ ఎమ్మెల్యేను చూసి కొందరు ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నాడు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశం, యువజన అధ్యక్షుడు పరుశురాములు, దుద్దెడ తాజా మాజీ సర్పంచ్ మహాదేవ్, పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్, సిద్ధులు, నరేశ్, కనకయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

16న వనమహోత్సవం

కొండపాక, జూలై 13: కొండపాక శివారులోని సత్యసాయి ప్రశాంతి నికేతనం మహిళా కళాశాలలో ఈ నెల 16న వనమహోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ పూర్ణిమశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ మను చౌదరి, ప్రముఖ సినీ నటుడు సుమన్ వస్తున్నారని తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక ప్రోత్సాహం

కొండపాక, జూలై 13: మండలంలోని దుద్దెడకు చెందిన రక్షిత ట్రిబుల్ ఐటీలో సీటు సాధించడంతో దుద్దెడ ఉద్యోగుల సంఘం ఆర్థిక సహాయం అందించింది. సంఘం ఆధ్వర్యంలో రూ.10500 అధ్యక్షుడు రాజు శనివారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

దుబ్బాక, జూలై 13: ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించని ఓ ప్రైవేటు స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ పేర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు.

సిద్దిపేటకు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుల బృందం

సిద్దిపేట క్రైం, జూలై 13: సిద్దిపేటలో ఇటీవల న్యాయవాది రవికుమార్ పట్ల పోలీసుల దురుసు ప్రవర్తన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుల బృందం సిద్దిపేటలోని జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో రవికుమార్‌ను శనివారం పరామర్శించారు. న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మెన్ సునీల్‌గౌడ్, సభ్యులు సత్యనారాయణ పరామర్శించిన వారిలో ఉన్నారు.

డీజీపీని కలిసిన బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు


డీజీపీకి శాలుక కప్పుతున్న అంబాల మహేశ్

మద్దూరు, జూలై 13: రాష్ట్ర డీజీపీగా నియమితులైన జితేందర్‌ను బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల మహేశ్ గౌడ్ డీజీపీ కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన డీజీపీ నియామకంతో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు కీలకపాత్ర పోషిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆర్థికశాఖ కార్యదర్శిని..

చేర్యాల, జూలై 13: జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి శేషాద్రిని శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. చేర్యాలకు మున్సిఫ్ కోర్టు మంజూరైనప్పటికీ సిబ్బంది నియామకం, ఇతరత్రా ప్రక్రియలో జాప్యం జరుగుతున్నదని, త్వరితగతిన సిబ్బందిని నియమించి కోర్టుసేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసకోవాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించి ఆయన త్వరలో నియామకం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనవెంట చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూమిగారి మనోహర్ ఉన్నారు.

బీజేపీ జిల్లా ఆర్మీ సెల్ అధ్యక్షుడిగా నీల చంద్రం


నియామకం పత్రం అందుకుంటున్న నీల చంద్రం

రాయపోల్, జూలై 13: బీజేపీ సిద్దిపేట జిల్లా ఆర్మీసెల్ అధ్యక్షుడిగా మండలంలోని అనాజీపూర్‌కు చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీల చంద్రాన్ని నియమించారు. నియామకపత్రాన్ని శనివారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఆయనకు అందించారు. తనపై నమ్మకంతో జిల్లా ఆర్మీసెల్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డికి, జిల్లా కార్యదర్శి విభీషన్‌రెడ్డికి, పార్టీ మండల అధ్యక్షుడు కాజాగౌడ్‌కు తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కస్తూర్బాలో విద్యార్థులకు మెరుగైన విద్య

● పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న


ఫ్రెషర్స్‌డే వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్దూరు, జూలై 13: ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని కస్తూర్బ పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు అందర్ని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న మాట్లాడారు. ఫ్రెషర్స్ డే వేడుకలు కొత్త విద్యార్థులకు స్వాగతం పలకడమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని నింపి వారి సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి 'పొన్నం' చిత్రపటానికి క్షీరాభిషేకం


మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

హుస్నాబాద్ టౌన్, జూలై 13: హుస్నాబాద్ మున్సిపల్ అభివృద్ధి పనులకు టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ. 20 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు క్షీరాభిషేకం చేశారు. ఈ నిధులతో హుస్నాబాద్ పట్టణంలోని వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైఎస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, రమాదేవి, కోమటి స్వర్ణలత, చిత్తారి పద్మ, లావణ్య, వాల సుప్రజ, వల్లపు రాజు, మ్యాదరబోయిన శ్రీనివాస్, అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ. అయూబ్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


హుస్నాబాద్‌రూరల్: లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్‌రూరల్/కోహెడ, జూలై 13: హుస్నాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మందికి మంజూరైన రూ.3.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, మడప జైపాల్‌రెడ్డి, వెన్న రాజు, బాలయ్య, పోలు సంపత్ ఉన్నారు.

కోహెడ మండలంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 21 గ్రామాల్లో 63 చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థి సంఘం ఆందోళన

సిద్దిపేట అర్బన్, జూలై 13: సిద్దిపేటలోని సురభి మెడికల్ కళాశాల వద్ద శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న వారిని పోలీసులు త్రీటౌన్‌కు తరలించారు.

నేడు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి రాక

హుస్నాబాద్, జూలై 13: హుస్నాబాద్ పట్టణంలో నేడు జరిగే రెడ్డి సంఘం ఎల్లమ్మ బోనాల వేడుకలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరవుతున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

నేడు 'వైశ్య కులసంఘం' సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న వైశ్య కులసంఘం నాయకులు

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 13: సిద్దిపేట వైశ్య కుల సంఘం ఏర్పాటుకు నేడు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు సన్నాహక సంఘం ప్రతినిధులు రాజు, వెంకటేశం తెలిపారు. పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న చందాసురేష్ ఫామ్‌హౌస్‌లో వైశ్య కులతతతసంఘం సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణంలో సుమారుగా 32 వార్డు వైశ్య సంఘాలు, 575 మంది వైశ్య సోదరులతో వైశ్య భవనం, 543 మంది వైశ్య సోదరులతో వైశ్య సంక్షేమ సమితితో కలిపి 34 సంఘాలు ఉన్నాయని, కానీ వైశ్యకుల సంఘం లేదని అన్నారు. వివిధ వైశ్య సంఘాల ప్రతినిధులు, పట్టణంలోని వైశ్యులందరూ సన్నాహక సమావేశానికి హాజరుకావాలని కోరారు. సమావేశంలో సన్నాహక సమావేశ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● కేజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి

చేర్యాల, జూలై 13: కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నికలముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి డిమాండ్ చేశారు. చేర్యాల పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌కు పలుమార్లు విన్నవించినా ఎలాంటి పురోగతి లేకపోవడం విచారకరమన్నారు. ఎంతోమంది గీతకార్మికులు తాటిచెట్లపై నుంచి పడి ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కోహెడ కొమురయ్య, బండకింది అరుణ్ కుమార్, అనగోని నర్సింహులు, రవీందర్, బండి కుమార్, రాజేశ్, పంజాల రవి పాల్గొన్నారు.

గడిపె మల్లేశ్‌కు సీపీఐ నాయకుల సన్మానం

హుస్నాబాద్ టౌన్, జూలై 13: హుస్నాబాద్ పట్టణానికి చెందిన కళాకారుడు గడిపె మల్లేశ్ ఉద్యమ గాన కోకిల అవార్డు పొందడంతో శనివారం పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో సీపీఐ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద పవన్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కనుకుంట్ల శంకర్, జనగామ రాజ్‌కుమార్, నాయకులు ఎడల వనేష్, జేరిపోతుల జనార్ధన్, బిచ్చాల శ్రీనివాస్, అంతయ్య, మంజుల, భవాని, రేవతి ఉన్నారు.

రచయిత లక్ష్మన్‌కు..

హుస్నాబాద్, జూలై 13: జర్నలిస్టు, రచయిత మంగళారపు లక్ష్మన్ రాసిన మాయని గాయాల నెత్తుటి చరిత్ర పుస్తకం ఇటీవల ఆవిష్కరణ కాగా శనివారం హుస్నాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో 1978-79 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల సమ్మేళనంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ మధుసూదన్‌రెడ్డి, ప్రముఖ సాహితివేత్త బి మల్లయ్య, కృష్ణకుమారి, మాధవిలత, మల్లారెడ్డి, బి లక్ష్మారెడ్డి, కొండ్లె వెంకటేశ్ తదితరులున్నారు.

వనమహోత్సవానికి సిద్ధంగా మొక్కలు

కొండపాక, జూలై 13: వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వన మహోత్సవం కోసం మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. పలుచోట్ల మొక్కల పెంపకం జోరుగా సాగుతున్నది. కొండపాక మండలం మర్పడగ శివారులోని నాగులబండ తేజోవనం వద్ద అటవీశాఖ అధికారులు చేపట్టిన మొక్కల పెంపకంలో, మండలంలోని పలు గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించిన నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఉపాధి హామీ కూలీలు మొక్కలు నాటడం కోసం గుంతలు తీసి సిద్ధంగా ఉంచారు. వర్షాలు పడగానే నాటడానికి శ్రీకారం చుట్టానున్నారు. అటవీశాఖ, ఈజీఎస్‌ల ఆధ్వర్యంలో నర్సరీలల్లో మొక్కల పెంపకం జరుగుతున్నది. నాగులబండ తేజోవనం నర్సరీలో వనమహోత్సవం కోసం ఇతర ప్రాంతాలకు పంపిణీ చేయడానికి సుమారు మూడు లక్షల మొక్కలను పెంచుతున్నారు. అలాగే మండలంలోని ప్రతీ గ్రామంలో ఉన్న నర్సరీలో సుమారు లక్ష వరకు మొక్కలు పెంచుతున్నారు. ఔషద మొక్కలతో పాటు నీడనిచ్చే వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. వేప, రావి, చైనాబాదం, మర్రి, జువ్వి, మేడి, పెద్దఏగు, తెల్లమద్ది, కానుగ, గుల్ మోహల్‌తో పాటు పండ్ల మొక్కలు అల్లనేరేడు, సీతాఫలం, దానిమ్మ, నిమ్మ, పూల మొక్కలు మందార, తంగేడు, గన్నేరు, గులాబీ తదితరాల మొక్కలు ఉన్నాయి. వర్షం పడగానే నాటేలా సిద్ధం చేశారు. నాగులబండ నర్సరీలో రెండుమూడు ఫీట్ల ఎత్తు పెరిగిన మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. అవి ఎండిపోకుండా నీరు పెడుతూ ఆపాడుతున్నారు. ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా నాటడంతో పాటు గతంలో నాటిన మొక్కలు ఎక్కడైనా ఎండిపోతే వాటి స్థానంలో మొక్కలు నాటడం కోసం చర్యలు తీసుకుంటున్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


నాగులబండ తేజోవనం వద్ద అటవీశాఖ అధికారులు ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలు

పచ్చదనానికి కృషి చేయాలి

మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలి. ఈ బృహత్ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలి. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కపాడడానికి అందరూ కృషి చేయాలి. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో నాటడం కోసం మొక్కలను సరఫరా చేస్తాం.

- వెంకటేశ్వర్లు, ఎంపీడీవో